క్లుప్తంగా

నేడు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

గట్టు: వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆరగిద్ద, మిట్టదొడ్డి గ్రామాల్లో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. చాగదోనలో పాఠశాల, అంతంపల్లిలో పాఠశాల అదనపు గది, ప్రహరీ నిర్మాణ పనులు, లింగాపురంలో అంగన్‌వాడీ భవనం ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

అందుబాటులోకి టాయిలెట్స్



ధరూరు: ఎల్‌వీసీ గ్రామాలయ వారు పాఠశాలల్లో నిర్మించిన బాలికల టాయిలెట్స్ నుంచి అందుబాటులోకి రానున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో నిర్మించిన టాయిలెట్స్‌ను సోమవారం ప్రారంభించనున్నారు. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయురాలు రేవతి తన తండ్రి కే.శే. పర్మాల నాగరాజు జ్ఞాపకార్థం పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు. దానిని కూడా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

పట్టాల పంపిణీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అయిజ: గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా ఉప్పల గ్రామంలో బీసీలకు పట్టాలిచ్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని ఉప్పల గ్రామ ఎంపీటీసీ ప్రహ్లాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబర్ 3, 4లలో గతంలో బీసీలకు ఇచ్చిన ప్లాట్ల స్థలంలోనే నూతనంగా పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. పాతవారి పేర్లు తొలగించి కొత్తవారి పేర్లను నమోదు చేశారని, బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ముదిరాజ్‌లు



గట్టు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే ముదిరాజ్ ఆత్మగౌరవ బహిరంగ సభకు మండల కేంద్రం, వివిధ గ్రామాల నుంచి ముదిరాజ్‌లు తరలి వెళ్లారు. గట్టు, మాచర్ల, బల్గెర, తప్పెట్లమొర్సు గ్రామాలతో పాటు వివిధ గ్రామాల ముదిరాజ్‌లు ప్రత్యేక వాహనాల్లో సభకు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో వెంకటేష్, నాగరాజు, తిమ్మయ్య, తిమ్మప్ప, చిన్న నర్సింహులు, మాచర్ల లింగన్న, ఆంజనేయులు, ఉరుకుందు, బల్గెర బత్తలయ్య, తప్పెట్లమొర్సు హనుమంతు ఉన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టుకు సూచికబోర్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయలేదని వారు ఆరోపించారు. నిత్యం వందలాది వాహనదారులు ఈ రహదారిపై తమ రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాత్రివేళలో కల్వర్టు సమీపంలో ఉన్న గుంత కనిపించక అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు సమీపంలో సూచికబోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతర సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. యాసంగి సీజన్ పనులు ప్రారంభం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాలలో పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్వాల, పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలిచ్చారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

పెద్దకొత్తపల్లి: పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు వంశీకుమార్, శబ్బీ, ఖాజా, ఖలీల్, వికార్, ఖయ్యూం, శేఖర్, జగదీష్, పృథ్వీరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోలే..

- 12 ఏళ్లుగా ఇరుకుగదుల్లో అధికారులు, సిబ్బంది
- రూ.25 లక్షలతో నిర్మించిన ఈజీఎస్ భవనం
- మౌలిక సదుపాయలు అంతంత మాత్రమే..



ప్రారంభానికి నోచుకోని ఈజీఎస్ కార్యాలయ భవనం

అయిజ: మండల పరిషత్ కార్యాలయం పక్కన నిర్మించిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్ ఈజీఎస్) నూతన కార్యాలయ భవనం పూర్తయి 12 ఏళ్లయినా ప్రారంభానికి నోచుకోవడంలేదు. రూ.25 లక్షలతో ఈజీఎస్ కార్యాలయ భవనంతో పాటు మహిళా సమాఖ్య (సెర్ప్) కార్యాలయ భవనం నిర్మాణం 11-11-2011 తేదీన అప్పటి మంత్రి డీకే అరుణ శంకుస్థాపన చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సమావేశ మందిరంతో పాటు మహిళా సమాఖ్య కార్యాలయం నిర్మించారు. ఈ భవనం పైన మొదటి అంతస్తులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం నిర్మించారు. నేటికీ 12ఏళ్లు గడిచినా ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో ఈజీఎస్ అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయం లోని రెండు చిన్నగదుల్లో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ మౌలిక వసతులు లేకపోవడంతో అటు అధికారులు, ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన ఈజీఎస్ కార్యాలయంలో కొంతకాలం మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు వారి కార్యకలాపాలు నిర్వహించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వారు పాతబస్టాండ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలోకి మకాం మార్చారు. ఇప్పుడు ఈజీఎస్ నూతన భవనం ఖాళీగా ఉంది. నూతన భవనంలో కూడా మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నూతన భవనం అసౌకర్యంగా ఉండడంతో ఈజీఎస్ అధికారులు నూతన భవనంలోకి వెళ్లేందుకు ఇష్టపడడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి ఈజీఎస్ నూతన భవనంలో మౌలిక వసతులు కల్పించి భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

సకాలంలో పనులు పూర్తికావు..



మండల పరిషత్ కార్యాలయం భవనంలో ఎంపీడీఓ కార్యాలయంతో పాటు సమావేశ మందిరం, ఈజీఎస్ కార్యాలయం ఒకేచోట ఉండడంతో ఎప్పుడూ జనాలతో సందడి, సందడిగా ఉంటుంది. ప్రజలు ఎక్కువై గందరగోళంగా తయారైంది. ఎవరి ఆఫీస్‌లు వారికుంటే బాగుంటుంది. ఉన్నతాధికారులు స్పందించి నూతన ఈజీఎస్ కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తే బాగుంటుంది.

– తిప్పన్న, ఉప్పల

సౌకర్యాలు లేక వెళ్లలేక పోతున్నాం



ఈజీఎస్ నూతన కార్యాలయంలో వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈజీఎస్ నూతన భవనంలో సౌకర్యాలు లేనందున ఆ భవనంలోకి వెళ్లలేకపోతున్నాం. గత్యంతరం లేక ఎంపీడీఓ కార్యాలయంలోని రెండు ఇరుకైన గదుల్లో విధులు నిర్వహిస్తున్నాం. రికార్డులకు, ఉపాధి సమానుతోనే గదులు నిండాయి. సామన్లు భద్రపరిచేందుకు గది లేదు. కొత్త భవనంలో సౌకర్యాలు కల్పిస్తే వెళ్లాలనుకుంటున్నాం.

– శరత్ బాబు, ఈజీఎస్ ఏపీఓ

ఉన్నతాధికారులకు తెలిపాం..



మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది మా కార్యాలయ భవనంలోనే పని చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో అనేక శాఖల అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇరుకైన గదులలో విధులు నిర్వహిస్తుండడంతో పనులు సకాలంలో పూర్తిచేయలేక పోతున్నాం. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపాం.

– సాయిప్రకాష్, ఎంపీడీఓ

అనుచరులకే సంక్షేమ పథకాలు



గంగిమాన్‌దొడ్డిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గట్టు: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులకే దక్కుతున్నాయని, అర్హులను, ఓట్లు వేసి గెలిపించిన వారిని విస్మరిస్తున్నట్లు జెడ్పీ చైర్ పర్సన్ సరిత ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరగబడదాం-తరిమి కొడదాం కార్యక్రమం ఆదివారం రాత్రి గంగిమాన్‌దొడ్డి, పెంచికలపాడు గ్రామాల్లో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను జెడ్పీ చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలు వివరిస్తూ, వీరికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాచర్ల వరలక్ష్మి, గట్టు ధనలక్ష్మి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, శ్రీదర్శన్‌రెడ్డి, వడ్ల వీరేష్‌చారి, షేక్షావలి, నర్సింహులు, మాచర్ల లక్ష్మణ్, గౌస్, మహబూబ్‌పాషా, నర్సింహులు పాల్గొన్నారు.

రైతులకు రెండులక్షల రుణమాఫీ

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. ఆదివారం ఆమె తిరగబడదాం, తరిమికొడదాం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మల్లాపురంతండాలో పర్యటించి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ, పింఛన్లు ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ పథకాలు పేదలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, ఆనంద్‌గౌడు, జనార్దన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఎం అబ్రహం

అలంపూర్: మహిళా సమాఖ్యలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏపీఎం, సీసీలు, వీఓఏలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య అధికారులు ఎమ్మెల్యేకు శాలువా పూలమాల వేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు తదితరులు ఉన్నారు.

100 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

అలంపూర్ రూరల్: ఎన్నో ఏళ్ల నివాసముంటున్న ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని క్యాతూర్‌లో వంద మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు, బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాజోలి: మండలంలోని పెద్ద తాండ్రపాడులో రూ.20 లక్షలతో పల్లె దవాఖానకు, వాల్మీకి గుడికి ప్రహరీకి ఎమ్మెల్యే అబ్రహం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దసరా కానుకగా బతుకమ్మ చీర



గ్రామీణ క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేస్తున్న నాగర్‌దొడ్డి వెంకట్రామిరెడ్డి

ధరూరు: దసరా కానుకగా సీఎం కేసీఆర్ మహిళలకు బతుకమ్మ చీరను అందిస్తున్నారని పాగుంట ఆలయ కమిటీ చైర్మన్ నాగర్‌దొడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగర్‌దొడ్డి, నెట్టెంపాడు గ్రామాల్లో బతుకమ్మ చీరలతో పాటు కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేశారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఫాతిమా, ఉసేనమ్మ, ఎంపీటీసీ తిప్పమ్మ, ఉప సర్పంచు మహేశ్వరమ్మ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు చెన్నప్ప, పల్లెన్న, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వంతెనపై గుంతలు



మానవపాడు: మండలంలోని గోకులపాడు నుంచి మానవపాడు వెళ్లే ప్రధాన రహదారి వంతెనపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవపాడు నుంచి అంతర్రాష్ట్ర రహదారి అలంపూర్ చౌరస్తా నుంచి రాయచూర్ వెళ్లే రోడ్డు కావడంతో నిత్యం రాకపోకలు కొనసాగుతున్నాయి. వంతెనపై గుంతల వల్ల రాత్రి సమయంలో ప్రయాణికులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన మంద కిష్టమ్మ అనారోగ్యంతో అకాల మరణం చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ పోతురాజు సోమనాద్రి ఆదివారం కొండేరుకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళం నాయకులు సవరన్న, లక్ష్మన్న, యోహాన్, బజారన్న, బీసన్న, చార్లెస్, దేవన్న ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా కార్యకర్తలు

అలంపూర్: ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ అన్నారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు లక్షల జీతం ఇస్తుందన్నారు. 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు ఫిక్సుడు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరమ్మ, చిట్టెమ్మ, ప్రమీల, భారతి, పద్మ, విజయమ్మ, లక్ష్మి, పద్మావతి, జయమ్మ, ఇమాంబీ, శివలింగమ్మ ఉన్నారు.

మల్దకల్: ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని తహసీల్దార్ కార్యాయంలో ఎదుట చేస్తున్న సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు 18 వేల పారితోషకం, రూ.5లక్షల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సరస్వతి, కాంతమ్మ, నర్సమ్మ, కేశమ్మ, కృష్ణవేణి, సుజాత, నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ పాల్గొన్నారు.

యువకులు ఆదర్శంగా నిలవాలి



పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

గట్టు: పోలీస్ ఉద్యోగాలను సాధించిన యువకులు ఇతరులకు ఆదర్శంగా నిలవడంతో పాటుగా మండలానికి మంచి పేరును తీసుకు రావాలని తిరగబడుదాం-తరిమి కొడదాం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బల్గెర నారాయణరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు కృష్ణలు కోరారు. పోలీస్ ఉద్యోగాలను సాధించిన వివిధ గ్రామాలకు చెందిన 21 మంది యువకులను ఆదివారం మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ దగ్గర కాంగ్రెస్ నాయకులు యువకులను ఘనంగా సన్మానించి అభినందించారు. గట్టు, మాచర్ల, బోయలగూడెం, చాగదోన, గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు, ఆలూరు గ్రామాలకు చెందిన యువకులు పోలీస్ ఉద్యోగాలను సాధించారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, కృష్ణ, రేపల్లెకృష్ణ, మాచర్ల వరలక్ష్మీవెంకటస్వామిగౌడు, ఆరగిద్ద నర్సింహులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'లో అర్హులకు అన్యాయం



రేచింతలలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్: గృహలక్ష్మి పథకంలో అర్హులకు అన్యాయం చేస్తున్నారని రేచింతల గ్రామస్తులు ఆరోపించారు. ఆదివారం రేచింతలలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయాలని ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెడితే, ఇళ్లు ఉన్నోళ్లకే మంజూరు చేశారని ధ్వజమెత్తారు. ఎంతో మంది పేదలకు పక్కా గృహాలు లేక గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారికి గృహలక్ష్మి పథకం మంజూరు చేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కేవలం అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్యం, బాలయ్య, ఆంజనేయులు, మహేష్, రాములు, భాస్కర్, తిరుపతయ్య, యాదయ్య, శేఖర్, కృష్ణయ్య, రాంచంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

అమరచింత: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్.రమేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంఆర్ కార్మికులను రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమాన్ని విరమించబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు అన్ని కార్మిక చట్టాలను వర్తింపజేయాలని, భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డులో మున్సిపల్ కార్మికులను సభ్యులుగా చేర్చి పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, తిప్పన్న, సునీల్, నాగరాజు, కాకి శ్రీను, మహేందర్ పాల్గొన్నారు.

నందిపేటలో ఇరువర్గాల ఘర్షణ

అడ్డాకుల: నందిపేటలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం ఆయన వెళ్తుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డు వెళ్లి చాలా మంది అనర్హులకు ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి పత్రాలను మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆయన ఎదుటే తోపులాటకు దిగారు. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత కూడా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఒకరినొకరు దూషించుకుంటూ తోపులాడుకున్నారు. లబ్ధిదారులతో బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. అరగంట పాటు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈక్రమంలో పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి తోపులాటను అడ్డుకున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?



శాంతినగర్ సమీపంలో రాయచూర్ రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు

- అలంపూర్-రాయచూర్ రహదారిపై ముళ్ల పొదలు
- ఇరుకు కల్వర్టుల వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

శాంతినగర్: అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారిపై మూడు రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులు, వా హనాల రద్దీ. వేగంగా వెళ్లే వాహనాలు. దీంతో త రచూ ప్రమాదాల బారిన ప్రయాణికులు. కొందరు మృత్యువాత పడుచుండగా మరికొందరు అవిటి వాళ్లుగా మారుతున్నారు. అలంపూర్ నియోజకవ ర్గంలో అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న 42 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు ప్రమాదాలకు హేతువుగా మారింది. నిత్యం వందల కొలది వాహనాలపై వేల మంది ప్రయాణికులు వారి వారి గమ్యస్థానాలకు వెళ్తుంటారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు కావడంతో భారీ వాహనాలు సైతం రహదారిపై వెళ్తుంటాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

దట్టమైన ముళ్లపొదలతో ప్రమాదాలు..

42 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిలో దారి పొడవునా ముళ్ల పొదలు మూసుకు పోయాయి. దీంతో వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. వంద అడుగుల మేర ఉన్న రహదారి 80 అడుగుల మేర ముళ్లపొదలు, పిచ్చిగడ్డితో మూసుకుపోయింది.

కల్వర్టుల వద్ద ప్రమాదాలు

అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ వరకు ఉన్న ర హదారిలో శాంతినగర్-వెంకటాపురం మధ్యన ఉ న్న కల్వర్టులు ఇరుకుగా ఉన్నాయి. కల్వర్టుల స్థానంలో కొత్త కల్వర్టులు నిర్మించలేదు. దీంతో కల్వర్టుల వద్ద తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సూచిక బోర్డులు లేవు..

కల్వర్టుల వద్ద ముళ్ల పొదలు మూసుకుపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్ర యాణికులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నా రు. వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో రోడ్డు చివరికి వెళ్లడం కల్వర్టు గోడలను ఢీకొట్టడంతో ప్రమాదాలు చేటుచేసుకుంటున్నాయి.

మృత్యుపాలవుతున్న ప్రయాణికులు..

శాంతినగర్ – వెంకటాపురం మధ్యలో వాగులపై సింగిల్ రోడ్డుపై పాత కల్వర్టులు శిథిలావస్థకు చేరి ఇరుకుగా ఉన్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఇటీవల ఇద్దరు యువకులు, ఓ కర్ణాటక వాసి మృత్యువాతపడ్డారు.

చీకటిపడితే మోటార్ సైకిళ్లపై వెళ్లలేం..



వివిధ పనుల నిమిత్తం శాంతినగర్, కర్నూలు ప్రాంతాలకు వెళ్లిన సమయంలో ఆలస్యమై చీకటి పడితే ప్రయాణికులు భయపడే పరిస్థితి ఉంది. కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు. – నవీన్‌రెడ్డి, యాపదిన్నె, అయిజ

ముళ్లపొదలు వెంటనే తొలగించాలి..



శాంతినగర్ నుంచి జూలెకల్ స్టేజీ వరకు ఉన్న డబుల్ రోడ్డులో ముళ్ల పొదలు మూసుకుపోయాయి. రోడ్డుపైకి కంపచెట్లు రావడంతో వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే ముళ్ల పొదలు తొలగించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆర్‌జీ రామకృష్ణ, ముండ్లదిన్నె, రాజోళి

ప్రతిపాదనలు పంపాం..

అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారిపై ముళ్లపొదలు తొలగించడానికి, గుంతలవద్ద ప్యాచ్ వర్క్ వేయడానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే ముళ్లపొదలు తొలగించి, గుంతలు పూడ్చి ప్రయాణికులకు సౌకర్యం కల్పిస్తాం.

– భార్గవ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ